# మేఘరంజని

శ్రీ ఎం. హెచ్. కేశవరావు

'అతను ఆత్మహత్య చేసుకున్నాడు' అన్నారాయన.

అంతటా గడ్డకట్టుకున్న నిశ్శబ్దం. అందరూ నిట్టూర్పుల్ని కూడా విడువకుండా వింటున్నారు. ఒక్కరూ ఆశ్చర్యాన్ని ప్రకటించడానికి కూడా జంకారు—అంత భయంకరమైన నిశ్శబ్దం.

ఆయన గొంతు మార్మోగింది నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ.

'అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంక గత్యంతరం లేక'—అంటూ అందరి ముఖాలవంక మరోసారి పరిశీలనగా చూశారు.

'ఇదే కథైతే మీకి ఎండింగ్ బాగుంటుందా, వెంకట్రావ్ గారూ?'-వెంకట్రావ్ ఉలిక్కిపడ్డాడు.

కాస్సేపాగి జోషి అన్నాడు.

'చెప్పలేం. కొన్ని జీవితాలకి, కథలకి ఇంకో అంతాన్ని ఊహించుకోలేను నేను. అనవసరంఅంటాను కూడా_ఎందుకంటే జీవితాలమీద అల్లబడినవే కథలు కాబట్టి. ఉదాహరణకు, భిన్నమైన జీవితాలైనా_దేవదాసు, క్లియోపాత్రాలను ఊహించుకోండి. అంత కఠినమైనదీ, భయంకరమైనదీ, ఒంటరిదికాదా జీవితం?'

'ఏదిఏమైనా అతను ఆత్మహత్య చేసుకోనడానికి కారణం ఇంకొకటేదైనా అయితే బావుండుననిపిస్తోంది' అంది శారద అప్పుడే లోపలికొస్తూ.

'ఇది కథకాదు, మీయిష్టంవచ్చినట్లు అల్లుకోడానికి' అనుకున్నాడు నావలిస్టు నరసింహారావు సిగరెట్ పొగ వదులుతూ. మేమెవరమూ మాట్లాడడానికి సాహసించలేకపోయినాము. నామన సెంగుకో అంత గొప్ప వాతావరణంలోనూ ఇమడలేకపోయింది; ఆ జీవితాన్ని విన్నతరువాత. ఒకరి సౌందర్యం తనదిగా చేసుకోవడంకోసం పడేబాధ, చివరకు ఆత్మ బలిదానాన్నికూడా చూశానుగాని, సంగీతంకోసం ఓఆత్మ అంత బాధపడి వుంటుందని నేనూహించుకోలేకపోయినాను. ఆయన్ని కలుసుకోవాలి ఒంటరిగా, వివరాలు తెలుసుకోవాలి అతన్ని గురించి అనుకున్నాను.

బయట కారువచ్చిన చప్పుడైంది. 'ఇంకా కథలు చెప్పుకోడం కాలేదూ—లేవండి ముఖర్జీగారూ మీకొరకు బయట అంతా ఎదురుచూస్తున్నారు' రాధ పిలుస్తోంది. అంతా తినబోయే కేకుని గుర్తుకు తెచ్చుకుని ఆకలిని రేపుకుంటూ బయటికొచ్చాం. పరిచయాలు, అభినందనలు, నవ్వులు పూర్తిగా గాలిని నింపేశాయి. కాస్సేపట్లో అంతా ఆరుబయట ఏర్పాటుచేసిన ఆ విందులో కలిసిపోయినాం. ఆ తరువాత శంకరశాస్త్రిగారి వీణ, నాయుడుగారి వయొలిన్, ముఖర్జీ గారి పియానో, పిచ్చిహరి సన్నాయిలలో లీనమయినప్పుడు నా హృదయం విషాదంతో నిండిపోయింది అతను గుర్తువచ్చి. నిజమే. దూడ అరుపుకీ, గాలి పిలుపుకీ, ఓ గీతానికీ, స్వరానికీ కదిలిపోవడం ఎంత గొప్పతనం! ఏ చదువు ఇవ్వగల దా సంస్కారం! పిచ్చివాడయి అతను బలియయిపోయినాడుగాని ఎంతమంది సానుభూతితో అర్థం చేసుకోగలరు చెప్పినా అతని కథని?

మేమంతా, క్రికెట్ నాగేశ్వరరావు కూడా కలిసి, పదిహేనుమందిమి బోట్‌క్లబ్ సభ్యులం ఆ జనవరిలో ఒక నిశ్చయానికి వచ్చాం. నగరంలో త్యాగరాజోత్సవాలు జరుగుతున్నాయి. ఇదే సమయం సంగీత కళానిధుల్ని వ్యక్తిగతంగా కలుసుకుని వారి ఆలాపనలో ఏకమైపోవడానికి. మా పదిహేనుమందిలో క్రికెట్ నాగేశ్వరరావు, బిలియర్డ్సు సుబ్రహ్మణ్యం, టెన్నిస్ జేమ్సు తప్ప అంతా రచయితలే. సంగీతమంటే పడిచచ్చేవాళ్లే. ఎప్పుడో ఓసారి సరిగమలు మొదలుపెట్టి భార్యల పోరు పడలేక ఆపేసిన వాళ్లు మాత్రం ఎక్కువనుంది. జనవరి ఆఖరు వారంలో బోట్‌క్లబ్‌లో ఒక స్నేహ సమావేశాన్ని ఏర్పాటుచేసి అందరినీ ఆహ్వానించాలని తీర్మానించుకున్నాం. ఈ విషయం ఎలాగో రెండుమూడు ఇతర క్లబ్బులవాళ్లకి కూడా తెలిసింది. 'అంతా కలిసి చేద్దాం అంటోంది

రాధ' అన్నాడు సుబ్రహ్మణ్యం. రాధ లేడీ హైదరీ క్లబ్‌కు ప్రెసిడెంటు. 'మా క్లబ్ మెంబర్సుకూడా ఇందులో పాల్గొనడానికి ఆనందంతో అంగీకరిస్తున్నారు' అని ఆమె తెలియజేసింది. చివరకు అంతా ఓ ముప్పయిమందిమి ఆహ్వానసంఘంగాను, ఇతర శాఖలుగాను ఏర్పడ్డాం. కర్ణాటక, హిందూస్థానీ సంగీతాలలో బాగా ప్రవేశమున్న ఓ పదిమందిని రాధ క్లబ్ ప్రతినిధులుగా పంపింది.

'క్లబ్‌లో కాదు, ఊరువిడిచి ఎక్కడికయినా పోదాం' ఇది ఆనందం సూచన. ఆనందం శాంతి నికేతన్ విద్యార్థి పెద్ద ప్రభుత్వోద్యోగి. అతని కింకా పెళ్లి కాలేదు. చదువుకుంటున్న రోజుల్లో అతనెవరో బెంగాలీ అమ్మాయిని ప్రేమించాడని. ఆమె యితన్ని మోసంచేసిందని సుబ్రహ్మణ్యం చెబుతాడు.

భగ్నప్రేమికుడి లక్షణా లేమీ ఆనందంలో లేవు. 'నే చెబితే నువ్వు నమ్మవ్. అసలు బెంగాలీ అమ్మాయిని ఎవరు ప్రేమించమన్నారు రా; శరత్ నవలలు చదివి అంతా అలాగే ఉంటారని కాబోలు వీడి ఉద్దేశం. వాళ్లకు ప్రేమించడం తెలుసునన్నా నీ అభిప్రాయం? ఉహుః —అందంగా మలచిన బండ రాళ్లు. భగ్నప్రేమికుడు గాకపోతే ఏమిటోయ్ వాడి కథల్లో అంత విషాదం'—ఇదీ సుబ్రహ్మణ్యం వాదన.

'ఎప్పుడూ చూసే వస్తువులూ, యీ వాతావరణమేనా? గొప్ప సంగీతం వినబోయేప్పుడైనా కొత్త వాతావరణాన్ని కోరుకోవా మీ మనసులు?' అన్నాడు ఆనందం విసుగ్గా.

'మనుషుల్ని వదలి పోతానంటావేరా—కొండలూ కోనలూ, చెట్లూ పుట్టలూ కావాలా?' అన్నాము జేమ్సు అప్పుడే ఓఆట ఆడేసి లోపలికివస్తూ.

'చెట్లూ, చేమలూ మనకు కావలసినంతఎక్కడా లేవు. ఇక హైదరాబాదు ఊరు వదిలితే మనకు కొండలు తప్పవు. ఎక్కడికయినా బయటికిపోదాం.'

'అదిగో అదే అనవద్దంటున్నాను. ఇక్కడ నీకేం తక్కువైందని' కసురుకున్నాడు సుబ్రహ్మణ్యం.

చివరికి ఆనందం తప్ప ఎవరూ క్లబ్ వదిలి బయటికి రావడానికి ఒప్పుకోలేదు. మా ఆహ్వానాన్ని నాటక సంగీత అకాడమీ అధ్యక్షులతో సహా అంతా ఒప్పుకున్నారు. పెద్ద ఎత్తున ఏర్పాట్లు సాగినై.

హాల్లో సోఫా సెట్లు, టేబుల్స్, రేడియో, గ్రూప్‌ఫొటోలు తీసేసి కాశ్మీర్ కుంకుమతోటలతో నిండిన కార్పెట్లు పరిచాం. నాలుగు మూలలా ఫ్లవర్ వాజులు ఎత్తుగానిలబడి పూలను అలంకరించుకున్నాయి. హుసేన్‌సాగర్ కెరటాల తాకిడికి రేగిన గాలిని ఆహ్వానిస్తూ మూడువైపులా నీలి తెరలు. హాల్లో ప్రవేశించేసరికి ఎదురుగా గోడమీద తన్మయత్వంలో త్యాగరాజు అది హైదరీక్లబ్ సెక్రటరీ జ్యోతి పెయింటింగ్. కాస్సేపట్లో చిరుకోపం, మళ్ళీ అంతలో విరహం, జాలిగా ప్రార్థిస్తో త్యాగరాజు.

'లాస్టియియర్ మైసూరుబృందం మొకటి దీన్నెలా అయినా తీసుకుపోవాలని విశ్వప్రయత్నం చేశారు—అమ్మో, నే నీ పెయింటింగ్ ఇవ్వగలనా?' జ్యోతి అంటోంది నాతో. మొదటిసారే కలుసుకున్నప్పుడు ఎన్నో ఏళ్ళుగా స్నేహం ఉన్నట్లు పికాసోనుండి దామెర్ల రామారావు వరకూ అన్ని సంగతులు మాట్లాడేసిందా అమ్మాయి. అందమైన ఆమె స్నేహం చాలా విలువ అయింది.

'అవునండి. కొన్ని వస్తువుల్ని మనం హృదయంలో పదిలపరచుకుంటాం. అందులోనుండి ఎవరినీ దొంగిలించనివ్వం'—

—'కాని, ఒక్క కాలానికే గదూ వాటిని చెరిపేసే హక్కు వుంది?' ఆమె నీలి ఆకాశంలోకిచూస్తూ అంది.

'కాలానికే ఆ హక్కు లేకపోతే—ఎల్లోరా శ్రీమూర్తి చేతులు విరగనిచ్చేవాడా మానవుడు' నీలిమతో నిండిన ఆమెకళ్ళు నావంక చూశాయి.

'బాల్యం ప్రతివాళ్ళకీ చాలా విలువైంది. అందుకే మనల్ని బాధించే క్షణాల్నుండి తప్పించుకోడానికి అప్పుడప్పుడు గతంలోకి పారిపోయి బ్రతుకుతాం. నిజానికి మీ పెయింటింగ్ చూశాకనే నాకు త్యాగరాజు పడిన తపన అర్థమవుతోంది.

'ఖగరాజు నీ ఆనతి విని వేగ చనలేదా
గగనానికి ఇలకు బహు దూరంబని నాడో—

మీరు నమ్మగలరా — యీ చరణం గుర్తుకువచ్చిన రాత్రులన్నీ నాకు నిద్రలేదు. గుండెలో పట్టలేని ఎంత విరహం అతనికోసం! జ్యోతి పేయింటింగ్ గోడకు అమరుస్తూ ఆగిపోయింది నా మాటలకు. ఆమె విశాలమైన కళ్లు అనుభూతితో కదిలినై. చెరిపెయగ

లేని చిరునవ్వు ఆమె పెదాలమీద పడమటి కొండల వెనక ఆగిన సూర్యకిరణంతోబాటు వెలిగింది.

ఆమెదే మరో పెయింటింగ్ 'నటరాజు' మూలగా అమర్చాం. ఏర్పాట్లన్నీ చూసి ఆనందం మాలో కలిసిపోయినాడు. అతని 'అవలోకితేశ్వరుడు'కి సుబ్రహ్మణ్యం హాల్లో అవకాశమిచ్చాడు.

'జ్యోతీ ఇంకా పటాలు అమర్చడం కాలేదూ' చాంద్ పిలుస్తోంది పర్షియన్‌కి అలవాటుపడిన పెదాలతో. జేమ్సు, నరసింహారావు అప్పుడే ప్రెస్‌కి వెళ్ళి వచ్చారు. వాళ్ళ మోటార్ సైకిల్ చప్పుడుతో మళ్ళీ కాలం కదిలింది ఆ సాయంత్రం.

నేను ఆఫీసుకు వెడుతున్నానన్నమాటేగాని ఆ రాత్రి ఎప్పుడు వస్తుందా అనే ఆలోచనే. ఎంతకీ చేప పడని జాలరిమల్లే అయిపోయింది మనస్సు. మళ్ళీ ఇన్నాళ్లకి గొప్ప అనుభవం కలుగబోతోంది సంగీతంలో.

ఆ సాయంత్రం.

ఒక గంట ముందుగానే ఆనందం ముఖర్జీ గారిని స్వయంగా తీసుకువచ్చాడు. ఆయననుగురించి వినడమేగాని నేనింతవరకూ చూడలేదు. మంచి స్ఫురద్రూపి. నలభై ఏళ్ళయినా ముప్పైఏళ్ల కుర్రాడిలా ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా ఉంటారు. తెల్ల పైజామా, తెల్ల సిల్కులాల్చీ, ఇట్టే స్నేహంచేసుకునే చూపులు, సంగీత తపస్సులో ఆలోకపు కాంతితోనిండిన ముఖ వర్చస్సు. ఆనందం పరిచయం చేశాడు అందరికీ. ఆయన వీణ వాయిస్తారు; పియానో వాయిస్తారు; అన్నిటికీ అనుబంధంగా చక్కగా పాడతారు.

కారు, బంగళా, నౌకర్లు, ఇనప్పెట్టె నిండా పేరు — వీటన్నింటికీ అంటని గొప్పతనం — ఒక్క మాటలో డబ్బుతో కొనుక్కోలేని గొప్పతనం. 'అనుభవం'కూడా ఇవ్వలేని కళాతృప్తి. భాషకి అతీతమైన సంగీత తపస్సు.

'ఎంత అదృష్టవంతుడు' అనుకుంది నా మనసు ఈర్ష్యగా.

అవును. ఏ మనిషిలోనో వెతుక్కుంటుంది తన సంస్కారాన్ని ప్రకృతి. ఏ శిల్పి ఉలిలోనో తన చక్కదనాన్ని దిద్దుకుంటుంది; ఏ గొంతులోనో హిమగిరి నుండి ఒక్కసారిదూకి ప్రవహిస్తుంది రాగఝరియై. కాని, చిత్రమేమంటే—యీ అన్వేషణలో యుగాలు గడవవచ్చు.

అందరం తివాచీమీద కూచున్నాం. ఆయన త్యాగరాజువంక చూస్తూ ఉండిపోయినారు. హాల్లో నిశ్శబ్దం. టాంక్ బండ్ మీద బస్సుల చప్పుడు. దూరంగా ఊరు విడుస్తున్న నిట్టూర్పు గాలిలో కలిసి హుసేన్‌సాగర్ నీటిమీదుగా వస్తోంది. ఎలా సంభాషణ మొదలుపెట్టాలో తెలీక అందరం ఆగిపోయినాం. చివరకు ఆనందం అన్నాడు— 'నే నెరిగినంతవరకు వీరికి తొమ్మిది భారతీయభాషలు వచ్చు. పండితులు కూడా. అయితే బెంగాలీలో ఎక్కువ కథలు వ్రాశారు. తక్కిన భాషలలో, ముఖ్యంగా తెలుగులో ఎందుకు వ్రాయరో నాకు అర్థంకాదు'—

ఆయన నవ్వుతూ వింటున్నారు.

అందరికళ్లలో ఆశ్చర్యం ఆయనకి తొమ్మిది భాషలు వచ్చునంటే. 'అయితే యీ సమయంలో ముఖర్జీగారు నాకున్న ఓ అనుమానాన్ని పోగొట్టాలి' అన్నాడు మళ్లీ ఆనందం.

'ఏమిటది?' అన్నారాయన చాలా స్వచ్ఛంగా.

'మీ రెప్పుడూ మనిషి నిత్య జీవితానికి సంబంధించిన సమస్యలపై కథలు వ్రాయరని, అందువలన ప్రజలకు మీ వ్రాతలు చాలా దూరంగా ఉంటాయని విమర్శకు లంటారు. అందుకు మీ సమాధానం ఏమిటి?'

'అంటే ఆర్థిక సమస్యలనా నీ ఉద్దేశం?' సుబ్రహ్మణ్యం.

'ఈ దేశంలో రోడ్డుమీద రిక్షావాడికి, మధ్యతరగతి కుటుంబీకునికి ఉన్నవి సమస్యలు కావనా నీ ఉద్దేశం?' జేమ్సు అందుకున్నాడు.

'అందుకు సమాధానం నన్నుకూడా చెప్పనివ్వండి' అన్నారాయన. అందరం ఆయనవంక చూశాం. జ్యోతి, ప్రతిమాదేవి, చాంద్ ఎప్పుడు వచ్చారో మా వెనక కూర్చునివున్నారు. సూర్యుడు చివరిగా కాసిని వజ్రాల్ని హుసేన్ సాగర్ మీద విసిరేసిపోయాడు. జాలర్లు తమ అదృష్టాన్ని బుట్టల్లో చూసుకుంటున్నారు, గుమ్మానికున్న నీలితెరలు గాలిని అదుపులో పెట్టలేకపోతున్నవి. మేల్కొంటున్న సంధ్య విరహంలో కాస్సేపు చిక్కుకుంది కాలం.

'ఎంత డబ్బు వుండీ పొందలేని అనుభవాలు, జీవిత లక్ష్యంకోసం బ్రతికాలనే ఆవేశం వుండే మనుషులే లేరంటారా?—అయినా మీరు చెప్పిన విష

యాలు వ్రాయడానికి ఎంతమంది కవులు, రచయితలు లేరు యీ దేశంలో?'—

'డబ్బు వుండికూడా పొందలేని అనుభవాలుంటా యంటారా?' అన్నాడు నాగేశ్వరరావు.

'ఉంటాయి. అటువంటివాళ్లకి ఒక్కొక్కప్పుడు డబ్బు ప్రతిబంధకం కూడా అవుతుంది?—కాసేపాగి 'అన్నీ పంచుతామంటారుగాని, చదువులు చెప్పిస్తారుగాని కళాతృష్ణని, గొప్ప కళాతృష్ణని, అనుభూతిని పొందే సంస్కారాన్ని ఎలా పంచుతారు? ఈ దేశంలో ఎంతోమంది యువతీయువకులకు జీవితానికో అర్థం వుంటుందని, లక్ష్యం వుంటుందనే విషయమే తెలీదు. అది వాళ్ళ పొరబాటు కూడా కాదులెండి—ఈ చదువులు, పెళ్లిళ్లు, పిల్లలు, వంటలు, ఉద్యోగాలు వెతుక్కోడం వాళ్లని అట్లా తయారుజేస్తాయి?'

'అయితే అవన్నీ నిరుపయోగమంటారా?'

'అవి వారికో మార్గాన్ని చూపలేనప్పుడు నిరుపయోగమే. పలకలేని వీణ బంగారందయినా నిరుపయోగమే; బంగారం విలువ బంగారానికి ఉండచ్చు.'

'అసలు జీవితానికో అర్థం వుంటుందని ఎందుకనుకోవాలి? ఏమీ లేదని బ్రతకడంలో ఆనందం లేదూ?' అన్నాడు నరసింహారావు.

'మీరు చెప్పే 'ఆనందం' ఆర్గ్యుమెంటుకీ అతీతమైంది. కళాత్మకమైన హృదయం ఓ మార్గం, తప్పక వెతుక్కుంటుంది. దానిని చేరేవరకు అది పొందే స్ట్రిగుల్ మాటతో చెప్పడం కష్టం. అది భాషకు అందని బాధ. ఆ మార్గం చూపే గమ్యం లక్ష్యం అన్నా, అర్థం అన్నా ఏదన్నా సరే.'

'ఎంత కళాత్మకహృదయమైనా ఆర్థికంగా బాగుంటేనే గదా ఓ మార్గాన్ని వెతుక్కోడం' అన్నాడు నాగేశ్వరరావు. డబ్బుతో పొందలేని అనుభవం అంటూ లేదని అతని విశ్వాసం.

'ఇంత చర్చ అనవసరం. నాకు తెలిసిన ఓ యువకుడి కథ చెబుతాను వినండి.' అని సాలోచనగా చూశారు అందరివంకా.

చిరువెన్నెల కెరటాలమీద నురగలా తెరలను దాటి గుమ్మంలో పడుతోంది. పైన ప్లేట్లు సర్దుతున్న చప్పుడు, హుసేన్‌సాగర్ నీళ్ళు క్లబ్ గోడలకు కొట్టుకుని చేస్తున్న సందడి, బయట ఓ కాకి అరుపు తప్ప మరే శబ్దమూ లేదు.

ఆయన చెప్పడం మొదలుబెట్టారు.

అతన్ని చిన్నప్పట్నించి బడి, యిల్లు తప్ప మరొకటి చూడనివ్వలేదు తలిదండ్రులు. తెల్లవారుఝామునే దాదివచ్చి లేపుతుంది. కాలకృత్యాలు తీర్చుకుని బడికివెళ్ళేవరకు చదువుకోవాలి. డ్రైవర్ కారులో అతన్ని బడివరకు దిగబెడతాడు. మధ్యాహ్నం దాది వెళ్ళి టిఫిన్ యిచ్చివస్తుంది. సాయంత్రం మళ్ళీ బడి వదలే సమయానికిహాజరై డ్రైవర్ ఇంటికి తీసుకువస్తాడు. స్నానం, భోజనం తరువాత రాత్రి నిద్రపోయేవరకు విధిగా చదువుకోవాలి.

ఇదీ అతని దినచర్య.

సాయంకాలాలలో పిల్లలు ఆడుకుంటారని చాలాకాలంవరకు తెలీదతనికి. స్నేహితులే లేరు. చేసుకునే వ్యవధి ఇవ్వలేదు. ఆకాశంలో తిరిగే గోళాలు, అవి చిమ్మే కాంతులు, అతనికి విస్మయం కలిగించేవి. అవేమిటో అతనికి తెలీదు. అమ్మ, నాన్న, దాది లేనప్పుడు కిటికీవద్ద కూర్చొని, ఆకాశంలో మారే రంగుల్ని చూస్తూ, తోటలో గాలికి చెట్ల మధ్య ధ్వనుల్ని వింటూ గడిపేవాడు. ఓరోజున పంతుల్ని ఆ గోళాలు ఏమిటనిఅడిగాడు. పంతులుఆశ్చర్యంగా చూసి, బెత్తం ఝళిపించి 'బండవెధవ' అన్నాడు తప్పితే సమాధానం మాత్రం చెప్పలేదు. పాపం, తలిదండ్రులు అతన్ని గొప్ప వాణ్ణిగా చేద్దామని చేసిన ప్రయత్నాలు అవన్నీ.

మొదటినుండీ అతనిగది ప్రత్యేకం. అందులోనే భోంచేయాలి. చదువుకోవాలి పడుకోవాలి. అతనికో పెద్ద అన్నయ్య వుండేవాడు. అతనికి పెళ్లి అయింది. అప్పుడు జరిగిన ఓ సంఘటన అతని జీవితాన్నే మార్చింది. పెళ్లికి ఎంతోమంది చుట్టాలొచ్చారు. కార్లు, మనుషులు, లైట్లు, చాకలెట్లు ఇల్లంతా చాలా సందడిగా వుంది. మొదటి సారిగా చాలామంది పిల్లల్ని వాళ్ల ఇంటిలో చూశాడు అతను. వాళ్లంతాజేరి ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. దొడ్లోకి పరుగెత్తి జామచెట్టెక్కి పిందెలు కూడా కోసేశారు. అతనికి ఆశ్చర్యం కలిగించాయి వాళ్ల చర్యలు. వాళ్లు మాట్లాడేది తన భాషే అయినా అందులో అతనికి తెలీని పదాలెన్నో వున్నాయి. వాళ్లలో ఓ కుర్రాడు చొక్కాతోనే ఇసకలో మొగ్గలేస్తున్నాడు. కాసేపాగి, అంతా

ఒకరి చొక్కా ఒకరు పట్టుకుని రైలాట ఆడుతున్నారు. అతని చెయ్యిపట్టుకుని ఓకుర్రాడు దొడ్డంతా పరుగెత్తించాడు. అతనికంతా గందరగోళం ఆక్షణం. ఒక్కసారి ఇసకలో దొర్లితే ఎంతో హాయిగా వున్నట్లనిపించింది. ఇంతలో ఎక్కడినుండి వచ్చిందో దాది పరుగెత్తుకుంటూ వచ్చి పిల్లలను తిడుతూ అతన్ని ఎత్తుకువెళ్లిపోయింది. ఎన్నడూ లేనిది ఆవేళ నాన్నగారు ఆతన్ని దగ్గర కూర్చోబెట్టుకుని బంధువులతో ఏమిటేమిటో చెబుతున్నారు. మధ్య మధ్య కొంతమంది అతన్ని బుగ్గలమీద ముద్దుకూడ పెట్టుకున్నారు. ఆతని మనసు గజిబిజి అయింది—కారణం, అంతకు ముందు రోజువరకు ఆతని ప్రపంచమే వేరు; పూర్తిగా.

ఆ రాత్రి పెద్ద విందు జరిగింది.

విందులో ఎవరో ఒకతను ఓ పెట్టెముందు కూర్చొని అందులోవున్న తెల్లని, నల్లని వాటిమీద వేళ్లతో నొక్కుతున్నాడు. వింత వింత ధ్వనులులొస్తున్నాయి. ఆ పెట్టెలోంచి అతను మరింత ఆశ్చర్యపడ్డాడు ఆ దృశ్యం చూసి. ఆ పెట్టె అన్ని విచిత్రమైన ధ్వనుల్ని ఎలా దాచుకోగలిగిందో? అంతా అరమోడ్పు కనులతో చూస్తున్నారు ఆ పెట్టెముందర కూర్చున్న తనివంక. ఆ పెట్టెవద్దకు వెళ్లి చూద్దామనుకున్నాడు గాని అమ్మఒళ్లో వుండిపోయినా.డు ఆమె పోనీదు. ఆ సంగీతానికి ఆశ్చర్యపడుతూ అట్లానే నిద్రలోకి జారిపోయినాడు అమ్మఒళ్లోనే.

అర్ధరాత్రి ఆతనికి వెలుకువవచ్చింది. కళ్లు నులుముకుంటూ లేచి చూసేసరికి తన గదిలో పక్కమీద ఉన్నాడు. ఆతని కింకా ఆ చిత్రమైన ధ్వనులే మెదడులో తిరుగుతున్నాయి. అటువంటి పెట్టె తన కొకటివుండి తనుకూడా అలాగే వాటిని కదిలిస్తూ ఉంటే బాగుండును. అందులో ఏముందో చూడాలి. అన్ని ధ్వనులు ఆ పెట్టెలో ఎలా పట్టాయో? తెరిచిచూడాలి. ఆతని కుతూహలం ఎక్కువైంది. మంచం దిగి బయటికివచ్చి చూశాడు. వరండాలో లైటు వుంది గాని ఎవరూ లేరు. క్రిందకు వెళ్ళాడు. ఆతని ఆనందానికి మేరలేదు - ఆ పెట్టె అక్కడనే వుంది. అంతా అదే - పైన చక్క మూత తీశాడు. ఆ తెల్లని, నల్లని వాటిని చేత్తో ఊడదీయాలని ప్రయత్నించాడు. ఎంతకీ రాలేదు. అతనిలో తొందర ఎక్కువైంది. అమ్మ, నాన్న, ఆ పిల్లలెవరూ రాకముందే అందులో ఏముందో చూడాలి. అటు యిటూ వెతికాడు. గోడవారను సుత్తిలాంటి దేదో ఇనప, దొరికింది. తీసి ఒక్క దెబ్బ వేశాడు. పెద్ద శబ్దం అతను జడుసుకునేంత వికృత శబ్దం. బండరాయి పైనుండి నీళ్ళలో పడింది.

'ఏమిటి, ఏమిటి?' అని కేకలు వేస్తూ అంతా పరుగెత్తుకు వచ్చేశారు.

'అల్లరి వెధవ! బంగారంవంటి హార్మోనియం పాటన బెట్టుకున్నాడు.' అంటోంది అమ్మ. అంతా అసహ్యంగా అతని వంక చూసి నట్లనిపించిం దతనికి. భోరున ఏడవాలనిపించింది. కాని ఏడ్వలేకపోయినాడు. రెక్క పట్టుకుని తండ్రి గదిలోకి లాక్కువచ్చి పక్కమీద పడేసినప్పుడు వెక్కి వెక్కి ఏడ్చాడు. ఏడుపులోనే నిద్రపోయినాడు.

'అల్లరి వెధవ. ఇంక ఇంట్లో వుంటే చదువు వచ్చినట్లే' ఇది అతని తండ్రి అభిప్రాయం. అంతే. ఆ సంవత్సరమే అతను కలకత్తాలోని ఓ బోర్డింగ్ స్కూల్లో చేర్పించబడ్డాడు. వాళ్ళ నాన్నగారి చిన్ననాటి స్నేహితుడు అక్కడనే ఉంటాడు. ఇదంతా అతని సలహా మీదనే జరిగింది. సెలవల్లో కూడా బయటికి రానివ్వద్దని నెలకో ఉత్తరం వచ్చేది ఆ స్నేహితునికి.

అలా గడిచింది ఆతని బాల్యం.

అతని కలకత్తా జీవితంలో కూడా చెప్పుకోదగ్గ మార్పేమీ లేదు. చదువు, చదువు, చదువు. ఎప్పుడూ చదువు. అతనిపై అధికారాన్ని చెలాయించి, ఎల్లవేళలా కనిపెట్టుకుని వుండడానికి వార్డెన్‌కు స్పెషల్ ఇన్‌స్ట్రక్షన్స్. సంవత్సరమంతా పరీక్షలకోరకు చదువు. సెలవల్లో కొత్త సంవత్సరానికి చదువు. ఆ పన్నెండేళ్ళలో అతను రెండుసార్లకంటె ఎక్కువ ఇంటికి రాలేదు. కొత్త భాషకి, కొత్త అలవాట్లకి, కొత్త మనుషులతో పరిచయాలకీ జీవితం అలవాటు పడుతోంది. ఎం. ఏ. పూర్తయ్యాక ఇంటికివచ్చాడు. ఆసంవత్సరమే అతని తండ్రి హృద్రోగంవల్ల మరణించాడు. కుటుంబ నిర్వహణాభారమంతా అన్నగారిపై బడింది. తల్లి వున్నా లేకపోయినా ఒకటే మొదటినుండీ. ఇంక ఆ ఇంటిలో వదినగారు మాత్రం అతనికి కొత్త. తన జీవిత విధానాన్ని గూర్చి ఒక నిర్ణయం తీసుకోవలసిన సమయం ఆసన్నమైంది అని అతను ఇంట్లో ప్రవేశించగానే అనుకున్నాడు.

నిజానికి, ఇక్కడి అతని దినచర్య అమర్చినట్లుగా ఉంది. ఉదయమే రేడియో మేల్కొల్పుతుంది. ముఖం కడుక్కోగానే టవల్ అందించడానికి, ఫలహార సిద్ధం చేయడానికి, అన్నింటికి నౌకర్లు ఉన్నారు. మేడ మీదనుండి క్రిందికి దిగిరావలసిన అవసరమే లేదు, ఒక్క షికారుకు తప్ప. ఇంక వదినగారు అతనికి తెలీకుండా అతనికి కావసినవన్నీ అమరుస్తుంది. మేడమీద అతని చదువులగదిలో కిటికీ తెరలు మారుస్తూ ఉండడం, ఉదయమే తోటలోని కొత్తపూలతో ఫ్లవర్ వాజులు నింపడం, పత్రికలు టేబుల్ పై పెట్టడం—యీపనులు నౌకర్లు జాగ్రత్తగా చేస్తున్నదీ, లేనిదీ చూడడం ఆమె చేసే కొన్ని పనులు. ఇంక జీవితంలో కోరుకోవలసిం దేమిటి? అని అందరూ అనుకోవడంలో అసహజం లేదు.

కాని అతనికి కావలసిందేమిటో అంతుపట్ట లేదు. ఆ రాత్రి నక్షత్రాలక్రింద ఆలోచించాడు జీవితం గూర్చి మరొకసారి. ఈ రాత్రింబగళ్ళలో తను వెతుక్కోవలసిం దేమిటి? సంప్రాప్తించిన యీ జీవితానికి ఓ గమ్యం లేదా? తను లక్ష్యంతో గురిచూసి వదలిన బాణం కాదా? లేక—పోతున్న దానిని అలా పోనివ్వడమేనా మానవుడు చేయవలసిన పని? క్రింద మంచుకు తడిసిన గడ్డి. పైన కాంతిని కురుస్తున్న నక్షత్రాలు అతనికేమీ జవాబివ్వలేదు. ఉద్యోగం వెతుక్కోడం, పెళ్ళిచేసుకోడం, పిల్లల్ని కనడం—ఇంకా ఆలోచించ బుద్ధి వేయలేదు. అతనికి జీవితం 'రిస్కు' అయిపోయింది. చదువు పూర్తి చేయలేని ఖాళీ అతనిలో ఉండిపోయింది.

రెండవరోజు సాయంత్రం తమ పొలాల్ని చూడడానికి ఒక్కడే కారులో షికారుగా వెళ్ళాడు. నగరానికి ఆ ప్రాంతం యాభై మైళ్ళ దూరముంటుంది. ఊరుబయట కారుఆపి, లాక్ చేసి, నడుస్తూపోయినాడు కొంతదూరం. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. నది ఒడ్డునుండి గడ్డిమోపుతో కూనిరాగం తీస్తూ ఓ పల్లెపడుచు వడివడిగా నడిచిపోయింది అతని ముందునుండి. పశువులు మందలు మందలుగా ఊరిలోకి ప్రవేశిస్తున్నవి. మందవెనక గోధూళిలో గొల్లపిల్లాడు రెల్లు పిల్లంగోవిని ఊదుకుంటూ మధ్య మధ్య మంద తప్పిన పశువుల్ని హే హే అంటూ పనిచేస్తున్నాడు.

అతను నది ఒడ్డుకు వచ్చేశాడు.

తన చిన్నితనంనుండీ యిలాగే ఎడతెరిపిలేకుండా ప్రవహిస్తోందీ నది. ఎక్కడ పుట్టిందో ఏఏ భూముల్ని కౌగిలించుకుంటూ వస్తోందో;—తన తండ్రి తాతలు తమ జీవితాన్ని యీ ప్రదేశాల్లోనే గడిపారు. వాళ్ళ ప్రతిబింబాల్ని తనలో ఎన్నిసార్లో చూసివుంటుంది యీనది. నిన్న తన తండ్రి, నేడు తను, రేపు తన కొడుకు—ఆ తరువాత? ఆ తరువాత తరువాత? ఏమిటీ అరణ్యంలోని మెలికలు తిరిగే అంతులేని కాలిబాట కర్థం? బయట చెప్పులు వదిలి నదిలో దిగి కాళ్లుకడుక్కున్నాడు. తనవల్ల అలజడి కాసేపు నదిలో. మళ్ళీ మామూలుగా తన దోవను తను ప్రయాణిస్తోంది.

చీకటిపడింది.

అతను ఇంటికి వస్తూ అనుకున్నాడు...ఏమిటా పల్లెపడుచు మిడిసిపాటు? ఆ గొల్లపిల్లాడి కుర్రతనం? ఆ నది అంతులేని అజ్ఞానం?—ఆ గడ్డిమోపు అమ్మితేగాని ఆపూట పొయ్యిమీదకు కుండ ఎక్కదని తెలుసా పల్లెపడుచుకి. మరి, ఎందుకంత ఆనందం; ముందు ఎవరున్నారనైనా మిడిసిపాటు?—ఆ రెల్లులోంచి విశ్వగానం వినబడుతుందనే ఆశ ఆ కుర్రాడికి లేదు. మరి, దానినెందుకు పొదల్లో పారేయడు?- తను ఏకోనల్లో పుట్టినా, ఏ నందన వనాల్ని ముద్దిడుకున్నా, చివరకు అన్నీ వదిలి ఏ అంతులేని ఎడారిలోనో అంతమవడమో, సముద్రంలో దూకి వ్యక్తిత్వాన్ని కోల్పోవడమో జరుగుతుందని తెలుసా నదికి. మరి, ఎందుకా నిరంతర ప్రయాణం? ఈ అజ్ఞానానికి అవధుల్లేవా ఇంక?

ఇంటికివచ్చేసరికి భోజనం మేడమీదకు పంపి వదినగారు ఎగురుచూస్తోంది. అతను భోజనం వద్దని, నౌకరుతో పాలు తెప్పించుకున్నాడు. ఎప్పుడూ ప్రశాంతంగా వుండే ఆ వాతావరణాన్ని భగ్నం చేస్తో ఎదురింటిలో సందడిగా ఉంది: బయట కార్లు, లోపల లైట్లు, మనుషులు, హడావుడి.

'ఏమిటి వెంకన్నా?' నౌకర్ని అడిగాడు.

'ఎవరో కొత్తగా దిగారుండి; మన ఇంటికికూడ సందకాడ వొచ్చిపోయినారు. ఆయనేదో పెద్ద ఉద్యోగస్థులంట. అన్నగారు ఆడనే వున్నారు.'

ఆరాత్రి అతనికి చాలాసేపు నిద్రపట్టలేదు. లైటు తీసేసి గదిలోంచి వరండాలోకి, వరండాలోంచి గదిలోకి పచార్లుచేస్తూ చాలారాత్రి గడిపాడు. సన్నజాజులమీంచి పాలవెన్నెల మెట్లమీద పడుతోంది. అతని మనసు చిత్రకారుడికే తెలీని రంగుల కలగాపులగంగా ఉంది. ఈ ప్రపంచంలో చాలామందికి

లేని ప్రశ్నలు తనకెందుకు వుండాలి? అదే ఓ పెద్ద ప్రశ్న. సమాధానం వెతుక్కోవాలి. హృదయంలో పరవళ్ళుద్రొక్కే అశాంతిని అణిచేంత శాంతి కావాలి. అర్థంచేసుకుని ఓదార్చే మరో హృదయం కావాలి. ఈజీచెయిర్‌లో ఒరిగి అలాగే మగతగా కన్ను మూశాడు.

రాత్రి పన్నెండుకొట్టింది క్లాక్ టవర్.

అతనొక్కసారి ఉలిక్కిపడి లేచాడు. 'ఏమయింది, ఏమయిది' అంటోంది నిద్రలోంచి యింకా పూర్తిగా మేల్కోని అతని మనస్సు. వెన్నెలతోపాటు ఎవరిదో గొంతు సన్నగా వినబడుతోంది. అదో విషాదగీతం. గీతంవెంట వీణానాదాలు జాలిగా రాత్రిని నింపేస్తున్నవి. ఆమె పాడుతోంది అతి దీనంగా. అబ్బ. భరించలేని విషాదం.

చంద్రుడు మబ్బులచాటుకు పోయాడు.

కొన్ని క్షణాలు రాత్రిని చుట్టుకున్న చీకటి.

ఎక్కడో గుడిగంటలు మ్రోగాయి. ఆ గానం ఇంకా సుళ్లు తిరిగి వస్తోంది. నిశ్చలమైన ఆ రాత్రిలో అబ్బ, ఎందుకంత విషాదం! అతను ఊగిపోతున్నాడు. కలలోంచి ఎవరో చేయి పట్టుకుని ఈడ్చుకుపోతున్నట్లుగా ఉంది. ఆమె పాడుతోనే ఉంది. వెళ్లాలి. తను అంత విషాదాన్ని భరించలేడు. వెళ్లాలి, వెళ్లి ? ఆ గానాన్ని పట్టుకొని ఆపెయ్యాలి. భరింపలేని ఆ విషాదాన్ని ఆపెయ్యాలి. ఆవేశంతో లేచాడు. తడబడుతూ రెండడుగులు వేసేసరికి ఠపీమని తల గోడకు కొట్టుకుంది. అమ్మా, అంటూ పక్కమీద పడిపోయినాడు......

'ట్రంగ్...ట్రంగ్...ట్రంగ్....' టెలిఫోన్ ఒకటేయిదిగా మోగుతోంది. ముఖర్జీగారు తమకథను ఆపి చిరునవ్వుతో అందరివంక చూశారు. ఎక్కడివాళ్లక్కడ బొమ్మల్లా వింటూ ఆయనవంకే చూస్తూ ఉండిపోయినారు; అంతవరకు.

నే వెళ్లి రిసీవర్ తీసుకున్నాను.

తా మింకో అరగంటలో వస్తున్నట్లు,ఆలస్యానికి క్షమించవలసిందిగా ఆకాడమీ అధ్యక్షులు చెబుతున్నారు అవతల.

'చెప్పండి. ఆ తరువాత ఏమయింది?' అంది జ్యోతి. ఆయన ఓ నిట్టూర్పు వదిలి మొదలు పెట్టారు.

ఉదయమే నౌకరువచ్చి చూసి పరుగెత్తుకుంటూ వెళ్లి అందరినీ పిలుచుకువచ్చాడు. నుదిటిమీద రక్తం చారలు కట్టింది. జ్వరంతో ఒళ్లంతా పేలిపోతోంది. వదినగారు కంగారు పడిపోయింది. డాక్టరు వచ్చాడు. ఒక యింజక్షన్ యిచ్చినా పగలల్లా జ్వరం తగ్గలేదు. అతను కన్ను తెరవలేదు. సాయంత్రం పళ్లరసంతో కాస్త తగ్గింది, కానీ లేవలేని నీరసం. డాక్టర్ సాయంత్రం మరో యింజక్షన్ యిచ్చి విశ్రాంతి తీసుకోవలసిందిగా గట్టిగా హెచ్చరించి వెళ్లాడు. అతను నిద్ర పట్టించుకున్నాడు.

రాత్రి పదిగంటలు కొట్టింది క్లాక్ టవర్.

ఆకాశంలో దివ్యదీపావళి కాబోలు వెన్నెల ముద్దలు ముద్దలుగా కురుస్తోంది. ఎక్కడో ఏదో పిట్ట అరుస్తోంది.

అత నొక్కసారి ఉలిక్కిపడి లేచాడు.

అదేగొంతు. ఆమె పాడుతోంది. కాని విషాద గీతంకాదు. మేఘరంజని అలాపన. ఆమెను లీనం చేసుకున్న ఆ ఆలాపన సుళ్లు సుళ్లుగా తిరిగి వస్తోంది. అతనా సుడిలో ఉక్కిరిబిక్కిరై పడి కొట్టుకుపోతున్నాడు. ఇంద్రియా లన్నీ కదిలిపోతున్నవి. గోళాలు గతులు తప్పుతున్నవి. వలయాలు, వలయాలుగా తిరిగి తిరిగి గాలిలోని ప్రతిఅణువునీ ఆక్రమించి విశ్వంలోకి ప్రవహిస్తోంది ఆలాపన. వలయాలు, వలయాలు....సంగీత వలయాలు.... అతనికి తెలుస్తోంది తనకి కావలసిం దేమిటో, తీరనికోరికలు చిత్రంగా బయటి కొస్తున్నవి వలయాలతాకిడికి—మరో లోకంలో అతనికి ఉదయమవుతోంది.

ఆమె అలాపిస్తోనే ఉంది.

సంగీతవలయాలు పైకిలేచి భూమిని మరింత వేగంగా త్రిప్పుతున్నవి. కాసేపట్లో ఆ వలయాలు మేఘాల్ని చేరుకుంటాయి. కాసేపటో మేఘాలు పిండయిపోతాయి. ఉరుములు, మెరుపులు...ఇంక కుంభవృష్టి. భూనంభోంతరాలమధ్య గోడల జలధారలు. అంతా జలమయం. సెలయేళ్లు మెలికలు తిరిగిపోయినవి. నదులు ఆగలేక గట్లు తెంపుకుని పొంగినవి. సముద్రాలు ఏకమైనై. పసిపాపలు గుక్కపట్టి ఏడుస్తున్నారు. తల్లులు ఎలుగెత్తి ఆక్రందిస్తున్నారు. గుడితలుపులు బార్లా తెరుచుకొని కొట్టుకుంటున్నవి. గంటలు ఊగుతూ గణగణా మ్రోగుతున్నావి. చెట్లు విరిగి పడుతున్నవి. ఆడవంతా తల్లక్రిందై మృగాలు దిక్కుతోచక కలియబడి దూకుతూ పోతున్నవి. ఉరుములు మెరుపులు... పొర్లుకుంటూ నీరు వచ్చేస్తోంది. పర్వత శిఖరాలు నీటిని చుంబిస్తున్నవి. ప్రాణికోటిని సమస్తం వెయ్యి నాల్కలతో తుడిచిపెట్టే జలప్రళయం.

భూమి ఊగిపోతోంది.

శంకరుని చేతిలోని డమరుకం ఆ కదలికకు క్రింద బడి ఒక మెట్టు మీంచి మరో మెట్టుమీదకు దొర్లుతూ మెట్టు మీద పడినప్పుడల్లా పెద్దశబ్దం చేస్తూ పడిపోతోంది.

ఒక్కొక్క మెట్టుమీద పడినప్పుడల్లా—
తథిగిణతోం
తథిగిణతోం

అనే ధ్వనులు లోకాల్ని ఏకం చేస్తూ వినబడుతున్నవి. నటరాజు భంగిమకు భంగమైంది. మరో క్షణంలో కళ్లు తెరుస్తాడు. ఇంక శివతాండవం. శివతాండవం. మూడవ నేత్రం తెరుచుకుంటుంది.

తథిగిణతోం
తథిగిణతోం

అంతా భస్మం అయిపోతుంది ఒక్క త్రుటి పాటులో.

అతనొక్క అదటున లేచాడు. వెళ్లాలి. ఆ గానాన్ని కౌగలించుకోవాలి. తన సర్వస్వం అర్పించేసుకోవాలి. ప్రశాంతి న్నాపాలి. హృదయంలోని ఆ ప్రశాంతి న్నాపాలి. ఆ ఆనందాన్ని హాలాహాలాన్ని హృదయంలో దాచేసుకోవాలి. అప్పుడే తన హృదయం అంతటా శాంతి చిమ్ముకుంటుంది. ఆ గానం తనకు కావాలి. ఆ అనుభవం తనకు కావాలి. తనే కరిగి సంగీతం కావాలి. ఒక్క దూకుతో క్రిందకువచ్చి గేటు తెరిచాడు. చెవుల్లో గింగురుమంటోంది ఆలాపన. లిప్తపాటు అవతలవరండాలోంచి మేడమెట్లెక్కి పై అంతస్థులోకి వెళ్ళాడు. అక్కడ ద్వారానికి ఎదురుగా ఆమె దివాసీమీద ఆలాపనే తానై ఉంది. అతని చూపులకు ఇంకేమీ కనబడడంలేదు. ఆమె, తను మధ్య బంధం ఆలాపన. పరుగున వెళ్ళి ఆమెను గట్టిగా కౌగిలించుకుని హృదయానికి హత్తుకుంటూ క్రిందపడిపోయాడు. గానం ముక్కలైంది.

పక్కనే ఆమె భర్త మీటుతున్న వీణ తంత్రులు తెగినవి.

కొద్ది క్షణాల అనంతరం అతనికి ఒక్కొక్కటే తెలుస్తోంది.

ఆమె కళ్ళుమూసుకొని ఒరిగిపోయింది. ఆతని కౌగిలినుండి ఆమెను విడదీస్తున్నాడు భర్త. అతని కన్నీ తెలుస్తున్నవి. ఎట్లా? తనెట్లా ఇంక వాళ్ళకి ముఖం చూపడం? పిచ్చివాడై జుట్టుపీక్కుంటూ వచ్చిన వాడు వచ్చినట్లే గదికివచ్చి పక్కపైపడ్డాడు

ముఖర్జీ గారి కంఠం బొంగురుపోయింది.

గత్యంతరం లేదు. తనకా ప్రాప్తి లేదు; ఇంక తన చదువు, సంస్కారం ఎందుకు? రీజన్‌కి అతీతమైంది అప్పటి అతని వేదన. ఆత్మహత్య చేసుకున్నాడు....

బయట కారు హారన్ మ్రోగింది. అంతటా సంచలనం. పెద్దలంతా లోపలికి వచ్చారు. ముఖర్జీ చూడగానే అంతా ఒక్కసారి కౌగిలించుకున్నారు. విందుకు దారితీశారు.

నా మెదడు మొద్దుబారిపోయింది. ఒకరి సౌందర్యాన్ని తమదిగా చేసుకోడం కోసం జరిపిన పోరాటాలు, త్యాగాలు చూశానుగాని సంగీతం కోసం ఓ ఆత్మ అంత బాధపడగలదని నేనెప్పుడూ ఊహించలేదు. శంకరశాస్త్రిగారి వీణ, నాయుడుగారి వయొలిన్, ముఖర్జీ గారి పియానో, పిచ్చిహరి సన్నాయిలలో లీనమయినప్పుడు నా హృదయం విషాదంతో నిండిపోయింది అతను గుర్తు వచ్చి.

వెంటనే ముఖర్జీ గారిని కలుసుకోలేకపోయినాను ఆ సమావేశంలో. ఉదయం బసవద్ద కలుసుకుందాం గదా అనుకున్నాను. ఉదయం వెళ్లేప్పటికి ఆనందం ఒక్కడూ ఉన్నాడు.

'ఏం యిలావచ్చావ్ పొద్దున్నే?' అన్నాడు.

'ముఖర్జీ గారు లేరూ, వారిని కలుసుకోవాలిరా.'

'అరే, ఇప్పుడే కారులో వారిని సాగనంపి వచ్చాను. రాత్రి ఆయనతో నే రాలేకపోయినావా?'

నా కేడుపువచ్చింది, నా దురదృష్టం తల్చుకో లేక.

'ఏం చాలా అవసరమా?' మళ్లీ అన్నాడు.

'నిన్న ఆయన చెప్పినఅతన్ని గురించి వివరాలు అడుగుదా మనుకున్నాను."

'ఓ అదా?'

'ఏం, నీకు తెలుసా?'

'అది ఆయన జీవితకథేలే.

'ఏమిటి నువ్వనేది?'

'అదేలేరా—ఆయన స్వీయచరిత్రే లే అది.'

'మరి'—

'నాకర్థమయిందిలే నీ సందేహం. ఆయన ఆత్మహత్య చేసుకున్నది. తన గత జీవితంలో. కలకత్తా వచ్చి కొన్ని సంవత్సరాలు రాత్రింబగళ్లనక సాధన చేశారు. అప్పటినుండి ఆయన తాను అప్పుడే పుట్టినట్లు భావిస్తారు. అందుకే పేరుకూడ మార్చుకున్నారు.'